
# శ్రీ విద్య



ఈ గ్రామానికి నన్ను శ్రీ విద్యానిలయంవారు ఆహ్వానించారు. ఈ విద్యానిలయానికి 'శ్రీ విద్యానిలయ' మనే పేరు చాలా యోగ్యంగా ఉంది. సాధారణంగా ప్రతి మనిషీ సుఖం కావాలని కోరుకుంటాడు. అది డబ్బు వల్ల వస్తుందనకుంటాడు అందుకని డబ్బు సంపాదించడానికి అవస్థ పడుతూ ఉంటాడు. ప్రపంచంలో అందరు మనుష్యులూ ఏదో ఒక విద్యను సాధించి పొట్టపోసుకుంటున్నారు అందులో నిజమైనసుఖం లేదు. ఎన్నో ఆటంకాలూ, అవమానాలూ, ఎదురౌతాయి. జీవితం చాలామటుకు దుఃఖభూయిష్టంగా ఉంటుంది. కేవలం పొట్టకూటికి చేసే వృత్తులు కళలు. ఆనందం కోసం అభ్యసించేవే విద్యలు. ప్రతిఫలాన్ని ఆశించకుండా మనకు ఇష్టమైన పనిచేస్తుంటే ఆనందం లభిస్తుంది. అంటే ప్రతిఫలం కోరకపోతే కళలు కూడా విద్యలౌతాయన్నమాట. 'అర్థకరీ చ విద్యా' అని ఉంది. ఇందులో 'చ' కారం వల్ల అర్థకారిత్వం ఉపసర్జనమౌతోంది. అంటే అప్రధానమని అర్థం. విద్యకు పరమలక్ష్యం ఆనందం. శాంతి సమత్వాలే దాని చరమలక్ష్యాలు. అప్పుడే అది 'అమృత' మౌతుంది. మిగిలనవనులన్నీ 'మృతాలే' అంటే చచ్చిపోయినవన్నమాట.

సరదాగా సంగీతం చెప్పుకోవచ్చు. కమ్మగా కవిత్వం వ్రాయవచ్చు. చక్కగా చిత్రం గీయవచ్చు పెద్ద పెద్ద ఉద్యోగాలు చేసి రిటైరయినాక అర్వైఏళ్ళు వచ్చాక, కొందరు కొందరు సంస్కృతం చదువుకోటం, వీణ, ఫ్లూటు మొదలైనవి నేర్చుకుని సంగీత సాధన చెయ్యటం; శాస్త్రాభ్యాసం చెయ్యటం లాంటివి మొదలుపెడుతూ ఉంటారు. అయితే అవి పొట్టకోసం కాదు. ఆనందం కోసం, సంగీతం, కవిత్వం, చిత్రలేఖనం వంటి లలిత కళలను కూటికోసం వాడుకుంటే అవి కూడా మృతాలైపోతాయి. అంటే చచ్చిపోతాయన్నమాట. అప్పుడవి ఆనందాన్ని ఇవ్వలేవు. నాటకాలు, సినిమాల్లాంటి అవినీతికరమైన పనులు లలితకళలనుకుంటారు. అది నిజం కాదు. సినిమాల మోజులోపడి పతితలైన స్త్రీలు ఎందరో ఉన్నారు. వాళ్ళ ఆకర్షణ తెర మీద మాత్రమే బయటకువస్తే సభ్యంగా ప్రవర్తించటం కూడా వారికి చేతకాదు.

మనం నేర్చుకునే విద్య 'నాకూ ఈ విద్యవచ్చు' అని డాంబికంగా చెప్పుకునేందుకు సరిపడినంత మాత్రమే అయితే అందులో ఆనందం లేదు. మనకు తృప్తి కలిగేంత వరకూ నేర్చుకుని యితరులకు కూడా నేర్పే శక్తి వచ్చినపుడే ఆ విద్యలో ఉన్న ఆనందం, రుచీ మనకు తెలుస్తాయి కనుక అందరూ జీవనానికి సమతనూ ఆనందాన్నీ అందించే యీ పరావిద్యను కూడా సాధించటం అవసరం. అది మనం సాధించి మన తరువాతవారికీ వారు ఆ తరువాతవారికీ అందిస్తూ పోవాలి. అది మనమే స్వయంగా ఆశ్రయించిన విద్య. కనుకనే శ్రీవిద్య. అట్టి శ్రీవిద్యను నేర్పటమే శ్రీ విద్యానిలయపు ప్రధానాశయం.

మనం మనుష్యులం లేక మానవులం అంటే మనువు సంతతివాళ్ళం. మననం చెయ్యటం, లేక మంత్రధ్యానం చెయ్యటం స్వభావంగా కలిగిన వాళ్ళం. ఇంగ్లీషులో man (మాన్) అనటం కూడా దీన్నే సూచిస్తుంది. కనుక మనుష్యులమైన మన అందరికీ మానసిక ఆనందమే ముఖ్యమైనది అంతకు తగ్గిన ఆనందం పశువులది. అది కేవలం యింద్రియసుఖం, కష్టసుఖాలను అనుభవించటం మాత్రమే దానికి తెలుసు. మనస్సును దుర్వినియోగం చేసే

మనకు ఈశ్వరునివలన లభించిన సంపదలో, ఆనందంతో కొంతభాగం ఈశ్వరార్పణం చేస్తేనే వాటిని అనుభవించే అర్హత మనకు కలుగుతుంది. అలా సమర్పించకుండా తమకుతామే అనుభవించేవాళ్లు దొంగలు.

''యోభుంక్తేస్తేన ఏవ సః''

కంచి మహాస్వామి శ్రీశ్రీశ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీ స్వామివారు

మనుష్యులకంటే పశువేనయం. అది డబ్బు నిలువజెయ్యదు. దానికి అప్పులూ ఉండవు. ''విద్యావిహీనఃపశుః'' అంటారు. కాని నిజానికి విద్యలేనివాడు పశువుకన్నా హీనుడు. విద్యావంతులవల్లనే జగత్తు పరిపూర్ణమౌతుంది. మనం అందరం పురుషులం. అంటే స్త్రీలను వదలిపెట్టాం అనుకోరాదు. ఎవరికి తగిన విద్య వారికున్నది. ప్రతి జీవీ పురుషుడే. ''పూర్ణం అనేన ఇతి పురుషః''. మనకు ఈశ్వరునివలన లభించిన సంపదలో, ఆనందంతో కొంత భాగం ఈశ్వరార్పణం చేస్తేనే వాటిని అనుభవించే అర్హత మనకుకలుగుతుంది. అలా సమర్పించకుండా తమకుతామే అనుభవించేవాళ్లు దొంగలు. ''యోభుంక్తేస్తేన ఏవ సః''

విద్యవల్ల కలిగే ఆనందాన్ని ఈశ్వరునికి సమర్పించే పద్ధతులు అంతులేవన్ని. వాటిలో కొన్నింటిని పుష్పదంత మహాకవి శివమహిమ్నస్తోత్రంలో యిలా వర్ణించాడు:-

''త్రయీసాంఖ్యం యోగః పశుపతిమతం వైష్ణవ మితి
ప్రభిన్నే ప్రస్థానే పరమిదమదః పథ్యమితిచ
రుచీనాం వై చిత్ర్యాత్ ఋజుకుటిల నానాపథజుషాం
నృణామేకో గమ్యస్త్వ మసి పయసా మర్ణవ ఇవ''

త్రయీ:- అంటే మూడువేదాలు వాటిని అధ్యయనం చెయ్యటం. వాటిలో చెప్పిన కర్మలను ఆచరించటం.

సాంఖ్యం:- మనశరీరం జడమైనది. నశించిపోయేది. దానికి తెలివి లేదు. ఇది మనకు అనుభవంలో తెలుస్తూనేవుంది. అలాగే నేను లావైనవాణ్ణి, నేను నల్లనివాణ్ణి, నాకు జబ్బు చేసింది యిత్యాది ప్రయోగాలలో ''నేను'' అనుకునే తెలివి కూడా మనకు తెలిసినదే ఇట్టి తెలివితో కూడిన శరీరాన్నే లోకంలో ''నేను'' అని వ్యవహరిస్తున్నారు. ఈ తెలివి, ఈ శరీరం కంటె పూర్తిగా వేరైనది - అన్న జ్ఞానమే సాంఖ్యం. దీనినే ప్రకృతిపురుషవివేకం అంటారు.

యోగం:- మన మనస్సెప్పుడూ చలిస్తూనే ఉంటుంది. మంచోచెడో ఏదో ఒకటి చేస్తూనే ఉంటుంది. దాని వెంటపడలేక మనం బాధపడుతూ వుంటాం. మనం ఆగమన్నా అది ఆగదు. ఆగితే అదే ఆనందం. యమ, నియమ, ఆసన, ప్రాణాయామాదుల ద్వారా మనస్సును ఆపే ప్రక్రియను యోగం అంటారు. 'యోగశ్చిత్తవృత్తినిరోధః'

పశుపతిమతం, వైష్ణవం:- మనం ఒక్క వడ్లగింజను కూడా సృష్టించలేము. ప్రపంచంలో ఉన్నవాటిని మాత్రమే అనుభవిస్తాము. అటువంటి ప్రపంచాన్ని సృష్టించే శక్తే భగవంతుడు లేక ఈశ్వరుడు ఆ శక్తి మనకంటే ఎంతో బలమైనది. దాన్ని అనుసరిస్తేనే మనకు సుఖము ఆనందమూను. ఈశ్వరుణ్ణే నమ్ముకుని మనం చేసే ప్రతిపనినీ అతనికి సమర్పించటం నేర్పే మతాలే శైవం, వైష్ణవం శివుడు దేవుడంటే శైవం. విష్ణువు దేవుడంటే వైష్ణవం.

క్రొత్త ఊరికి వెళ్లినప్పుడు కొందరు సూటిగా తమకు పనివున్న చోటికే వెళ్తారు. కొందరు ముందు ఊరంతా తిరిగి చూచి వస్తారు. అలాగే పరమా

**దేవాలయంలోని నైవేద్యపుగంట మ్రోగిన తరువాతనే గ్రామస్థులందరూ భోజనాలు చెయ్యాలి - అన్న అలవాటు పుట్టింది. అప్పుడు ఎవరియింట్లో వారు చేసుకున్న వంటకూడా దైవప్రసాదం అవుతుంది.**

నందాన్ని పొందించే యీ దారుల్లో కూడా కొన్ని సూటిగా ఆనందాన్ని యిచ్చేవి, కొన్ని ముందు ప్రపంచాన్ని చూపించి తద్వారా ఆనందాన్ని తరువాత కలిగించేవి. అందరు చేరే చోటూ ఒక్కటే.

కొందరు తూర్పుగా ప్రయాణం చేయవచ్చును. కొందరు పడమరగా, యింకకొందరు దక్షిణంగా, మరి కొందరు ఉత్తరంగా ప్రయాణం చేయవచ్చును. అందరూ ఒకే చోటుకు ఎలా చేర్తారు? మనం తూర్పుగాపోతే దగ్గర్లోనే సముద్రం వస్తుంది. పడమరగాపోతే 500 మైళ్ళల్లో ద్వారక దగ్గర, దక్షిణంగాపోతే 800 మైళ్ళల్లో కన్యాకుమారివద్ద, ఉత్తరంగాపోతే 5000 మైళ్ళలో ఉత్తర ధృవం వద్ద సముద్రమే. నర్మదానది పడమరగా ప్రవహిస్తోంది. గంగాయమునలు తూర్పుగా, బ్రహ్మపుత్ర దక్షిణంగా శోణానది ఉత్తరంగా ప్రవహిస్తున్నాయి. అన్నీ సముద్రాన్నే చేరుతున్నాయి. సముద్రం మన భూమిని ఎలా ఆవరించి ఉన్నదో, ఈశ్వరుడు ఈ జీవులను అలా ఆవరించి ఉన్నాడు. మనం ఏం పనిచేసినా ఈశ్వరార్పణం కాకతప్పదు.

మనం బ్రతుకు తెరువుకు చేసే పనులలో కూడా కొంతభాగం ఈశ్వరార్పణం చేస్తే అది ''అమృత'' మౌతుందని యిదివరకు చెప్పుకున్నాము. బ్రతుకు తెరువుకు మనం అవలంబించే చేతిపనులు లేక కళలు మనసంప్రదాయంలో 64 ఉన్నాయి. అవే శ్రీ చక్రంలోని 64 సంధులు. గ్రామంలోని అన్ని వృత్తులవారూ తమతమ వృత్తులను ఈశ్వరార్పణం చేసేచోట దేవాలయం.

దేవాలయాల్లో మేళతాళాలు, భజనలు, గంటలు, మొదలైన రొదలు ఉంటాయి కదా - అక్కడ ధ్యానమెలా చేయటం? అని కొందరి ఆక్షేపణ. దేవాలయం త్యాగం చేసేచోటు కానీ ధ్యానమందిరం కాదు. ధ్యానం చేసేందుకు నదీతీరాలలో తీర్థాలు వేరే ఉన్నాయి. అలా ధ్యానం చెయ్యలేనివారు, ఉదాహరణకు ఒక కట్టెలుకొట్టి జీవించేవాడుకూడా తన శరీరపోషణకు ప్రతి రోజూ చేసేపనులలో అయినా కొంతభాగం ఈశ్వరార్పణం చేస్తే అదే షోడశోపచారపూజ అవుతుంది. పామరులు స్త్రీ బాల వృద్ధులు కూడ యథాశక్తిపత్రమో పుష్పమో ఫలమో తోయమో సమర్పించవచ్చును. ధనవంతుడు తన ధనమును త్యాగం చేసి దేవాలయాన్ని వైభవోపేతం చెయ్యవచ్చును. విద్యావంతులు అంటే జ్ఞానులు అపౌరుషేయములైన వైదికమంత్రాలతో అనుష్ఠానాలతో తమతపస్సును ధారపోయవచ్చును. అలా అందరూ తమతమ ఆనం

**హృదయంలో మాధుర్యముంటే ప్రపంచ మంతా మధురంగానే ఉంటుంది. ప్రపంచాన్నంతటిని, అంటే అవమానాలనూ బాధలను కూడా ప్రేమతో మధురంగా ఆనందంగా అనుభవించటమే శ్రీవిద్య.**

దాలను యితరులతో పంచుకుంటే ఒక మహాశక్తి ఉద్భవిస్తుంది. అలాంటి మహాశక్తిని పుట్టించే చోట దేవాలయం.

అలా పుట్టినశక్తి సవ్యంగా అందరికీ అందుతున్నాదా? అన్న అజమాయిషీ అతి ప్రధానమైంది. దేవాలయాన్ని ఒకవేళ మనం దర్శించలేకపోయినా అది పెద్ద తప్పుకాదు. అందుకే దేవాలయంలోని నైవేద్యపుగంట మ్రోగినతరువాతనే గ్రామస్థులందరూ భోజనాలు చెయ్యాలి - అన్న అలవాటు పుట్టింది. అప్పుడు ఎవరియింట్లో వారు చేసుకున్న వంటకూడా దైవప్రసాదం అవుతుంది.

అలా మన ఆనందాన్ని సమష్టిగా పంచుకున్నప్పుడే మనలో నిజమైన సామ్యవాదము, ఆత్మీయతా ఏర్పడుతాయి. ఇప్పుడు సాధారణంగా ఉపన్యాసాలు ప్రారంభించేముందు ప్రతివారూ ''సోదర సోదరీమణులారా!'' అని సంబోధిస్తున్నారు. అందరూ సోదరీసోదరులెలా అవుతారు? సభకు వచ్చినవారందరికీ ఒకేతల్లీ ఒకే తండ్రీ ఉండట సంభవమా? సంభవమే. మన అందరికీ తండ్రి ఈశ్వరుడు. తల్లి పరాశక్తి. ''జగతః పితరౌవందే''.

ఈ సోదర సోదరీభావం మనుష్యులకే కాదు, పశుపక్ష్యాదులకూ, చెట్లకూ మొక్కలకు కూడా వర్తిస్తుంది. వాటినీ ఈశ్వరుడేకదా సృష్టించినది! ఈ విషయం గ్రహిస్తే ఎవ్వరూ హింసచెయ్యలేరు. మాంసాహారులు మాంసం తినలేరు. బుద్ధుడు ''అహింసాపరమోధర్మః'' అని అనటమైతే అన్నాడు కాని, ఈ రోజున చీనాలో బర్మాలో బౌద్ధసన్యాసులు మాంసాన్నే భిక్షగా స్వీకరిస్తున్నారు. అక్కడ ప్రతివారూ పెళ్లికిముందు కొంత కాలం సన్యాసం స్వీకరించాలని నియమమున్నదట. చెప్పేమాటకూ చేసేపనికీ పొంతనలేనప్పుడు పెద్ద పెద్ద సిద్ధాంతాలవల్ల ప్రయోజనమేమిటి?

హింస చెయ్యకుండా మనం బ్రతకటం సంభవమా? ప్రతి వడ్లగింజా ప్రతి గోధుమగింజా ఒక జీవియేనే! ఒక్కొక్క గింజ తిన్నప్పుడల్లా ఒక్కొక్క భ్రూణహత్య చేస్తున్నామే! ఈ పాపం చెయ్యకుండా ఎలా తప్పించుకోవటం? గింజలు తినకుండా గుజ్జుమాత్రమే తనదగిన పూర్తిగా మ్రగ్గిన పండ్లనూ, పండుటాకులనూ, ఆహారంగా స్వీకరిస్తే ఏ జీవికీ హింసలేదు. ''జీర్ణపర్ణాశనాః ఋషయః'' ఋషులు పండుటాకులు మాత్రమే తిని జీవించేవారట. మనం నిమ్మపళ్ళు, బత్తాయిపళ్ళు, మామిడిపళ్ళు, అరటిపళ్ళు వగైరాలు తినవచ్చును. అవైనా పూర్తిగా పండి రాలిన తరువాతనే. పచ్చికాయి కోస్తే సొన కారుతుంది అంటే కాయ తెగిన బాధకు చెట్టు ఏడుస్తున్నదన్నమాట. పూర్తిగా పండిన పండు మనం కోయికపోయినా అదేరాలిపోతుంది. అంతే కాదు మ్రగ్గిన ప్రతి పండులోను కూడా చివరకు వేపపండు చింతపండులలో కూడా ఎంతో కొంత మాధుర్యం వస్తుంది. పరిపక్వమైన ప్రతిఫలమూ మధురమే ఇలాంటి ఆహారాన్నే ఎందుకు స్వీకరించాలి? ''ఆహారశుద్ధౌసత్త్వశుద్ధిః'' ఇట్టిసాత్త్వికాహారులకు కామోద్రేకం కలుగదు. అట్టివారికి కుటుంబ నియంత్రణకై కృత్రిమ సాధనాలతో భ్రూణహత్యలు చేసే గతి పట్టదు. వారికి కలిగేది పరిమితమైన ధర్మప్రజయే. వారు క్రోధానికి కూడా లొంగరు. కనుక అట్టివాళ్ళున్న సమాజంలో ప్రపంచశాంతి దానంతట అదే వస్తుంది.

ఇటువంటి ఆహారం బలాన్నిస్తుందా? ఒక ఆంగ్లేయుడు ''భారతీయులందరూ అనాగరికులు. వారి తిండి హీనమైనది'' అన్న విశ్వాసంతో ప్రతి రోజూ అమెరికా నుండి మాంసాహారం తెప్పించుకుని తినేవాడు. ఆయనే సంస్కృతం చేర్చుకోవటం మొదలుపెట్టాడు. ఒకరోజున ''శుష్కైఃతృణైః వనగజాః బలినో భవన్తి'' - అన్న కాళిదాసుని శ్లోకాన్ని విన్నాడు. అంతే అతని బుద్ధిమారిపోయింది. మాంసాహారాన్ని వదిలిపెట్టాడు. జంతువులన్నిటిలోకీ బలమైంది ఏది? ఏనుగు. అది తినేది ఏమిటి? ఎండుగడ్డీ - ఆకులు. సింహము ఏనుగు కంటే బలమైనది కాదా? అని కొందరనవచ్చును. కాదు. సింహము ఎద్దులాగే బరువును కూడా బండికికడితే లాగలేదు. సింహము వంటి మాంసాహారుల బలమంతా వినాశనానికే ఉపయోగిస్తుంది. మధురఫలాహారులకు ప్రపంచమంతా మధురమే.

హృదయంలో మాధుర్యముంటే ప్రపంచమంతా మధురంగానే ఉంటుంది. మన పసిపాపలు మనల్ని కొట్టినా ముద్దుగానే ఉంటుంది. అదే పని యితరులు ఎవరైనా చేస్తే వారిని తిరిగి కొడతాం చేతకాకపోతే 'పోలీసు రిపోర్టు' యిస్తాం. 'కోర్టు' లో 'కేసు' పెడతాం అదీ చేతకాకపోతే ఏడిచి ఊరుకుంటారు. కాని సంతోషించం. ప్రపంచాన్నంతటిని, అంటే అవమానాలనూ బాధలను కూడా ప్రేమతో మధురంగా ఆనందంగా అనుభవించటమే శ్రీవిద్య.

కొందరు 'మాకు భుక్తికుదరటంలేదు. ఏమి చెయ్యమంటారు?' అని నన్నడుగుతున్నారు. వారికి నేనిచ్చే సలహా, 'కేవలం జీవనోపాధికి కాకుండా, మీ ఆనందం కోసం మీకు ఇష్టమైన ఏ విద్యనైనా నేర్చుకోండి' అని. భగవంతుడు వేదవిద్యాస్వరూపుడు. విద్యాభ్యాసమే భగవద్భక్తి, ఇది ఒక శ్రీవిద్య. మంత్రమూ, చక్రమూ ఉపాసనా ఉన్న శ్రీవిద్య యింకొకటి వేరే ఉన్నది. అది అందరికీ అనవసరం. కానీ, యింతవరకూ బోధించిన శ్రీవిద్య అందరికీ అవసరమైనది యిష్టమైనది.

ఈ శ్రీవిద్యానిలయంలో పొట్టకూటికైన కళలను మాత్రమే కాక, కనీసం ఒకవిద్యనైనా నేర్పమనీ అలా నేర్చుకునే విద్యార్థులనే చేర్చుకోమనీ, నా సలహా. అప్పుడే శ్రీ విద్యానిలయమన్న పేరు సార్థకమౌతుంది. అందుకు శ్రీమత్త్రిపుర సుందరీ, చంద్రమౌళీశ్వరులు అనుగ్రహించాలని ఆశీర్వదిస్తున్నాను.

(ఇది, 25-1-1968 ప్లవంగ పుష్యబహుళ ఏకాదశీ గురువారం రాత్రి 8 గంటలకు ఉయ్యూరు శివాలయంలో శ్రీ విద్యానిలయానికి శ్రీ కాంచీ కామకోటిపీఠాధీశ్వరులు జగద్గురు శ్రీశ్రీశ్రీ చంద్రశేఖరేంద్రసరస్వతీ స్వామి వారు అనుగ్రహించిన సందేశము.)